ఏపీఎన్జీవిఎఫ్ నెల్లూరు
జిల్లా నూతన
కార్యవర్గం ఎంపిక
03

RNI: APTEL/26/A8235

అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

అక్షర దర్శిని
దినపత్రికలో పని చేయడానికి
అనుభవం కలిగిన, జర్నలిజంపై
ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను.
కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9912808090
8374168090

నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -31 | శనివారం 31 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్నయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-

పురపోరులో ముగిసిన ప్రచార పర్వం

- చివరి రోజు టాప్‌గేర్‌లో మంత్రి నారాయణ
- కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముమ్మర ప్రచారం
- శాశ్వత పట్టాల లబ్ధిదారుల ఘన స్వాగతం
- అభివృద్ధి కొనసాగాలంటే కూటమిని గెలిపించాలని పిలుపు

నెల్లూరు, (అక్షర దర్శిని): నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. చివరి రోజున మంత్రి పొంగూరు నారాయణ ప్రచారంలో మరింత దూకుడు ప్రదర్శించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పావులు కదిపారు. ముఖ్యంగా బీజేపీ, జనసేన పోటీ చేస్తున్న డివిజన్లపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారంతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. సతీమణి రమాదేవి, అల్లుడు పునీత్‌తో కలిసి 21వ డివిజన్ సర్వేపల్లి కాలువ కట్టపై నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన లభించింది.

పట్టాలిచ్చిన మంత్రికి ఘన స్వాగతం
సర్వేపల్లి కాలువ కట్ట నివాసితులకు ఏళ్ల తరబడి వేధిస్తున్న ఇళ్ల సమస్యకు పరిష్కారం చూపుతూ శాశ్వత ఇంటి పట్టాలు మంజూరు చేయించిన మంత్రి నారాయణకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. రహదారిపై పూలు పరిచి కృతజ్ఞత చాటుకున్నారు. మహిళలు మంత్రి దంపతులకు గుమ్మడికాయతో దిష్టి తీసి, మంగళహారతులు ఇచ్చారు. పట్టాల రూపంలో తమ నివాసాలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ స్పందనను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల్లో లభిస్తున్న ఆదరణగా కూటమి నేతలు అభివర్ణించారు.

బీజేపీ, జనసేన అభ్యర్థుల గెలుపుపై గురి చివరి రోజు ప్రచారంలో భాగంగా 68వ డివిజన్‌తో పాటు బీజేపీ అభ్యర్థి బరిలో ఉన్న 13వ డివిజన్‌లో మంత్రి కుటుంబం అభ్యర్థులతో కలిసి రోడ్‌షోలు నిర్వహించింది. జనసేన అభ్యర్థి గుణుకుల విజయలక్ష్మి, బీజేపీ అభ్యర్థి కావ్య, టీడీపీ అభ్యర్థి శైలజతో పాటు మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని నారాయణ కోరారు. కూటమి ధర్మంలో భాగంగా మిత్రపక్షాల అభ్యర్థుల విజయానికి మంత్రి స్వయంగా ప్రచారం చేయడం చివరి రోజు కార్యక్రమాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

అభివృద్ధి పనులపై నారాయణ వివరణ
నెల్లూరులో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ మంత్రి నారాయణ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. 2014లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి ప్రాజెక్టుల కోసం రూ. 1,100 కోట్లు తీసుకొచ్చామని, రూ. 940 కోట్లతో 90 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మిగిలిన పనులు పూర్తి చేయకపోవడంతో రూ. 160 కోట్ల నిధులు వెనక్కి

▶▶ మిగతా 4 లో.......

కాకాణి కుటుంబం దోపిడీలకు అంతులేదు!

- ప్రభుత్వ భూములనూ బినామీల పేరుతో కొల్లగొట్టారు
- రుస్తుం మైన్ లో అక్రమంగా దోపిడీకి పాల్పడ్డారు
- బాధితుల పక్షాన సత్యాగ్రహం చేస్తే నాపైకి రెండు బస్సుల్లో హిజ్రాలను పంపించారు
- మళ్లీ ఆ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదు
- అయ్యగారిపాలెం, మహమ్మదాపురంలో సోమిరెడ్డి ఘాటు విమర్శలు

పొదలకూరు,(అక్షర దర్శిని): దశాబ్దాలుగా పొదలకూరు ప్రజల ఓట్లతో అధికారం అనుభవించిన కాకాణి కుటుంబం దోపిడీలకు పాల్పడిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన కాకాణి గోవర్ధన్ రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇతరుల మైనింగ్ వ్యవహారాల్లో అక్రమంగా జోక్యం చేసుకుని దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను సైతం తన అల్లుడు, అనుచరులు, బినామీల పేర్లతో కాజేశారని మండిపడ్డారు. పొదలకూరు మండలంలోని అయ్యగారిపాలెం, మహమ్మదాపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సోమిరెడ్డి పాల్గొన్నారు. పొదలకూరు జెడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డితో పాటు మండలంలోని 19 మంది ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రచార సభల్లో ఆయన వైసీపీ నాయకత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మండలంలోని వరదాపురం రుస్తుం మైన్ లో కాకాణి దోపిడీని ప్రశ్నిస్తూ బాధితుని పక్షాన తాను సత్యాగ్రహం చేపడితే తనపైకి రెండు బస్సుల్లో హిజ్రాలను పంపించారని సోమిరెడ్డి ఆరోపించారు. జిల్లా చరిత్రలో ఇంతటి

▶▶ మిగతా 3 లో.......

నెల్లూరును నంబర్ 1 స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా

నెల్లూరు, (అక్షర దర్శిని): నెల్లూరు నగరాన్ని దేశంలోనే నంబర్--1 స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తామన్నారు. డిసెంబరు నాటికి ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని, వచ్చే ఏడాది జూన్ 12 నాటికి భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేసి కనెక్షన్లు ఇస్తామని వెల్లడించారు. నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఎంపీ వేమిరెడ్డి, మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు. నెల్లూరు తన జన్మభూమి అని, నగర అభివృద్ధి బాధ్యత తనపై ఉందని నారాయణ పేర్కొన్నారు. 2014--19 మధ్య నగరంలో విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. సంగం బ్యారేజీ నుంచి తాగునీరు తీసుకొచ్చి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేలా చర్యలు చేపట్టామని, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ కోసం రూ. 550 కోట్లు, భూగర్భ డ్రైనేజీ కోసం మరో రూ. 550 కోట్లు తీసుకొచ్చామని వివరించారు. మొత్తం రూ. 1,100 కోట్ల ప్రాజెక్టులో రూ. 940 కోట్ల పనులు పూర్తి చేశామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం తమపై కోపంతో మిగిలిన రూ. 160 కోట్ల పనులను నిలిపివేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని తిరిగి ప్రారంభించామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సహకారంతో అదనంగా రూ. 945 కోట్లు విడుదల చేయించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెల్లూరులో ఎండ్ టు ఎండ్ రోడ్ల నిర్మాణం చేపట్టామని, వచ్చే ఏడాది జూన్ నాటికి దుమ్ము లేని నగరంగా

తీర్చిదిద్దుతామని నారాయణ చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో 153 లక్షల టన్నుల చెత్తను పేరుకుపోయేలా వదిలేసిందని, దానిని తొలగించే చర్యలు చేపట్టామని తెలిపారు. పెన్నా నది సమీపంలో వాటర్ పార్క్, నెక్లెస్ రోడ్డు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, నగరంలోని పార్కులను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. 2015 వరదల సమయంలో నగరంలోని అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని గుర్తుచేశారు. భవిష్యత్తులో అలాంటి

▶▶ మిగతా 4 లో.......

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం.. పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం
04

ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు కార్డుకు ప్రత్యామ్నాయంగా గుర్తింపు కార్డులివే!

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల
- 20 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు

నెల్లూరు,(అక్షర దర్శిని): స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ నవంబర్ 1న ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలను అనుమతించింది. ఓటరు గుర్తింపు కార్డు లేని పక్షంలో ఎన్నికల సంఘం సూచించిన క్రింది 20 రకాల ఫొటో గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఆదాయపు పన్ను శాఖ జారీ చేసిన పాన్ కార్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులు, ఫొటోతో కూడిన పెన్షన్ పేమెంట్ ఆర్డర్, మాజీ సైనికుల పెన్షన్ పుస్తకం, వృద్ధాప్య, వితంతు పెన్షన్ పత్రాలు, ఫొటోతో కూడిన పట్టాదారు పాస్‌బుక్‌లు, రిజిస్టర్డ్ ఆస్తి పత్రాలు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, పోస్టాఫీసులు, ఏపీసిఓబి,డిసిసిబి లు జారీ చేసిన ఫొటో పాస్‌బుక్‌లు, కిసాన్ పాస్‌బుక్‌లు, బ్యాంకులు జారీ చేసిన ఫొటోతో కూడిన ఏటీఎం కార్డులు, ఫొటోతో కూడిన రేషన్ కార్డులు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్పిఆర్) కింద ఆర్జిఐ జారీ చేసిన స్మార్ట్ కార్డులు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, సంబంధిత అధికార సంస్థ జారీ చేసిన ఫొటోతో కూడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ ధ్రువీకరణ పత్రాలు, ఫొటోతో కూడిన స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపు కార్డులు, ఫొటోతో కూడిన ఆయుధ లైసెన్సులు, సంబంధిత అధికారి జారీ చేసిన ఫొటోతో కూడిన దివ్యాంగ ధ్రువీకరణ పత్రం, బార్ కౌన్సిళ్లు జారీ చేసిన ఫొటోతో కూడిన సభ్యత్వ కార్డులు, కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసిన ఫొటోతో కూడిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శాసనసభ, శాసనమండలి సచివాలయాలు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులు, ఎంపీలకు లోక్‌సభ, రాజ్యసభ సచివాలయాలు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

అరవ లిఖితకు మాదాసు గంగాధరం దంపతుల సంపూర్ణ మద్దతు

- జడ్పీటీసీ ఎన్నికల్లో విజయానికి ఆశీస్సులు

కలువాయి,(అక్షర దర్శిని) : నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి అరవ లిఖిత ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుని తనకు మద్దతు తెలిపి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం కుల్లూరు గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం దంపతులను ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రానున్న జడ్పీటీసీ ఎన్నికల్లో తనకు మద్దతు అందించాలని కోరారు.అరవ లిఖిత విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మాదాసు గంగాధరం దంపతులు ఆమెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. కుల్లూరు పంచాయతీ పరిధిలోని కుల్లూరు, మజరా గ్రామాలైన వెంకటరెడ్డిపల్లి, రాజుపాలెం గ్రామాల్లో కలిపి సుమారు 4,600 మంది ఓటర్లు ఉన్నారని, ఆయా గ్రామాల ప్రజల ఆశీస్సులు అరవ లిఖితకు లభిస్తాయని వారు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం దంపతుల మద్దతు ప్రకటించడంతో అరవ లిఖిత శిబిరంలో ఉత్సాహం నెలకొంది. గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, తనకు అవకాశం కల్పించాలని ఆమె కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో అరవ లిఖిత భర్త డాక్టర్ రాజేష్, టీడీపీ సీనియర్ నాయకులు మల్లికార్జున యాదవ్, అల్లంపాటి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన

అల్లూరు, (అక్షర దర్శిని) : ప్రపంచ మానసిక ఆరోగ్య నెలను పురస్కరించుకుని అల్లూరు మండలం తూర్పు గోగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి. మానస ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతపై వివరించారు. ఈ సందర్భంగా ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడం, వ్యక్తిత్వ వికాసం, జాలి, దయ, ఇతరులతో కలిసిమెలిసి ఉండటం, అవసరమైన వారికి సహాయం చేయడం, ఇతరుల నుంచి సహాయం పొందడంలో సంకోచించకపోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. వెంకట కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో విజయమే లక్ష్యంగా కూటమి ప్రచార జోరు

- పల్లెపల్లెనా పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి
- సవిటి కాలువల నిర్మాణంలో అవకతవకలు జరిగాయంటూ వైసీపీపై విమర్శలు

వెంకటాచలం,(అక్షరదర్శిని): సర్వేపల్లి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. పల్లెపల్లెనా పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నారు. అదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అవినీతి, అక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.వెంకటాచలం మండలంలోని ఇస్కపాళెం, పుంజులూరుపాడు, గుడ్లూరువారిపాళెం, తిరుమలమ్మపాళెం పంచాయతీల్లో సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అభ్యర్థి దారా అన్నమ్మను, గుడ్లూరువారిపాళెం ఎంపీటీసీ స్థానానికి పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థిని సైకిల్ గుర్తుపై, ఇస్కపాళెం ఎంపీటీసీ అభ్యర్థి సుహాసినిని కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కూటమి అభ్యర్థులతో కలిసి ఆయన సాగించిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

సవిటి కాలువల నిర్మాణంపై విమర్శలు వైసీపీ హయాంలో సాగునీటి కాలువలతో పాటు సవిటి కాలువల నిర్మాణంలోనూ అవినీతి చోటుచేసుకుందని సోమిరెడ్డి ఆరోపించారు. నుడా నిధులు రూ.26 కోట్లతో సవిటి కాలువల నిర్మాణం చేపట్టినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో నీరు సజావుగా ముందుకు సాగకుండా వెనక్కి మళ్లి నిలిచిపోయేలా నిర్మాణాలు జరిగాయని విమర్శించారు. ఈ పరిస్థితుల వల్ల ప్రజలు దోమల బెడద, దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు.ప్రజలకు ఉపయోగపడాల్సిన కాలువల నిర్మాణాలను కూడా కొందరు నేతలు తమ ఆదాయానికి మార్గంగా మార్చుకున్నారని ఆరోపించారు. కాలువల నిర్మాణంలో లోపాలను సరిచేయకుండా శిలాఫలకాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారని ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్న వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్న సోమిరెడ్డి, స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. గ్రామాల అభివృద్ధికి కూటమి అభ్యర్థుల విజయంతో మరింత అవకాశం ఉంటుందని ఆయన ప్రచారంలో వివరిస్తున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కూటమి శ్రేణులు సమన్వయంతో ప్రచారాన్ని ముమ్మరం చేయడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది.

నెల్లూరు కార్పొరేషన్‌లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- మా కుటుంబానికి ఆత్మీయులైన నలుగురు ఎన్నికల బరిలో ఉన్నారు
- రూప్ కుమార్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి: ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు,(అక్షర దర్శిని): నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తమ కుటుంబానికి మొదటి నుంచి ఆత్మీయులుగా ఉన్న పలువురు అభ్యర్థులు కార్పొరేటర్లుగా పోటీ చేస్తుండటం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. నగర మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్‌తో పాటు కూటమి అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.నెల్లూరు నగరంలోని అల్లీపురంలో ఉన్న తన నివాసంలో ఐదో డివిజన్ పరిధిలోని మేకలవారితోట, పీకేజీ కాలనీ వాసులు సోమిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం నవలాకుల తోటలో పర్యటించి రెండో డివిజన్ అభ్యర్థి మహమ్మద్ జావీద్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ఆత్మీయులకు అండగా సోమిరెడ్డి నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో మొదటి డివిజన్ నుంచి కుడుముల చిరంజీవి, రెండో డివిజన్ నుంచి మహమ్మద్ జావీద్, మూడో డివిజన్ నుంచి మేకల అనిల్ సతీమణి మధుపావని, ఐదో డివిజన్ నుంచి అబ్రహం పోటీ చేస్తున్నారని సోమిరెడ్డి తెలిపారు. వీరంతా తమ కుటుంబంతో సుదీర్ఘకాలంగా ఆత్మీయ సంబంధాలు కలిగి ఉన్నారని చెప్పారు.మొదటి డివిజన్ అభ్యర్థి చిరంజీవి ఈశ్వరయ్య కుమారుడని, రెండో డివిజన్ అభ్యర్థి జావీద్ రెహమాన్ కుమారుడని పేర్కొన్నారు. మూడో డివిజన్‌లో మేకల అనిల్ సతీమణి మధుపావని, ఐదో డివిజన్‌లో అబ్రహం ఎన్నికల బరిలో ఉన్నారని వివరించారు. తొలుత శ్రీనివాస మహల్‌లో, అనంతరం ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన అబ్రహం మంచి వ్యక్తి అని, ఆయనతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు.ఈ అభ్యర్థులకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి సోమిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై వైసీపీ తీరును విమర్శిస్తూ.. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై వైసీపీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేసి అడ్డుకుందని సోమిరెడ్డి విమర్శించారు. న్యాయస్థానాల్లో ప్రతికూల తీర్పు వచ్చినప్పటికీ జనరల్ స్థానంలో బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారని పేర్కొన్నారు.నెల్లూరు నగర మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్పొరేషన్‌లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తే నగర అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని సోమిరెడ్డి ప్రచారంలో వివరించారు.

బ్రాహ్మణపల్లిలో పిచ్చికుక్క బీభత్సం

ఒకే రోజు 16 మందిపై దాడి.. గ్రామస్థుల్లో భయాందోళన!

కలువాయి,(అక్షర దర్శిని): నెల్లూరు జిల్లా కలువాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం కలకలం రేపింది. ఒకే రోజు 16 మందిపై దాడి చేసి కరిచి గాయపరచడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా కుక్క దాడులకు పాల్పడటంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. కుక్క కాట్లకు గురైన వారిలో పలువురికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పొదలకూరులోని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఒకే రోజు ఇంతమందిపై కుక్క దాడి చేయడంతో గ్రామంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో సంచరిస్తున్న పిచ్చికుక్కను పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో వీధికుక్కల బెడదను నియంత్రించడంతో పాటు ప్రజల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కుక్క కాట్ల ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కుక్క కాటుకు గురైన వారు ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రిలో వైద్యసహాయం పొందాలని, వైద్యుల సూచనల మేరకు రేబిస్ నివారణ చికిత్స తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

కళ్యాణపురంలో సుమలత ప్రచార హోరు!

- బిరదవోలు అభివృద్ధికి అండగా నిలవండి
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ నాయకుల విజ్ఞప్తి
- ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తా –సుమలత

పొదలకూరు,(అక్షర దర్శిని): పరిషత్ ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు మండలం బిరదవోలు ఎంపీటీసీ సెగ్మెంట్ టీడీపీ అభ్యర్థిని అన్నలూరు సుమలత ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శుక్రవారం సాయంత్రం కళ్యాణపురం గ్రామంలో టీడీపీ నాయకులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవంబర్ 5న జరగనున్న ఎన్నికల్లో తనతో పాటు జెడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థిని సుమలత మాట్లాడుతూ తనను ఆదరించి గెలిపిస్తే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో బిరదవోలు ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. స్థానిక సంస్థలు బలోపేతమైతేనే గ్రామాలకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేరుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో బిరదవోలు సెగ్మెంట్‌లో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు టీడీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కళ్యాణపురంలో టీడీపీ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు అన్నలూరు చెన్నకృష్ణమ నాయుడు, వెన్నపూస రమణారెడ్డి, అక్కెం బుజ్జిరెడ్డి, ఎత్తపు వెంకటరెడ్డి, రావుల శ్రీనివాసులు గౌడ్, రావుల భాస్కర్ గౌడ్, బడుగు సూర్యనారాయణ, వంపులూరు శ్రీనివాసులు గౌడ్ తదితరులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏపిఎన్జివిఎఫ్ నెల్లూరు జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక





జిల్లా అధ్యక్షురాలిగా జి.వి. సునీత.. కార్యదర్శిగా డి. వెంకటేష్

నెల్లూరు,(అక్షర దర్శిని): ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఏపిఎన్జివిఎఫ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అబ్జర్వర్ కె. రాజేశ్వరి, జిల్లా చైర్మన్ ఎం. శీనయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన కార్యవర్గ ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతం, ఉద్యోగుల సంక్షేమం, వివిధ శాఖల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో నెల్లూరు వీఏ అసోసియేషన్‌కు కో-ఆప్షన్ ద్వారా ప్రతినిధిని ఎంపిక చేయడం, 2027 సంవత్సరానికి క్యాలెండర్ రూపకల్పన, ఉద్యోగుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంపై చర్చించారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

నూతన కార్యవర్గం వివరాలు:

- జిల్లా అధ్యక్షురాలు: జి.వి. సునీత
- అసోసియేట్ అధ్యక్షుడు: ఎస్.కె. జలీల్ బాషా
- ఉపాధ్యక్షులు: ఎన్. ఓబయ్య, బి. వీరాంజనేయులు, ఐ. జగదీష్
- కార్యదర్శి: డి. వెంకటేష్
- సంయుక్త కార్యదర్శులు: వై. అతిలకాంత్, ఎ. ప్రియాంక
- కోశాధికారి: ఎస్.కె. జమీర్ బాషా
- కార్యవర్గ సభ్యులు: జి. ఓబయ్య, ఎస్.డి. రఫీ, యు. మల్లికార్జున, ఎన్. మహేశ్వరి, సి.హెచ్. వెంకటేష్

ఈ సందర్భంగా రాష్ట్ర అబ్జర్వర్ కె. రాజేశ్వరి, జిల్లా చైర్మన్ ఎం. శీనయ్య మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఎ

కాకాణి కుటుంబం దోపిడీలకు అంతులేదు!

మొదటి పేజీ తరువాయి

నీచమైన చర్యలకు పాల్పడిన వ్యక్తి మరొకరు లేరంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని రామదాసు కండ్రిక, కొమ్మలపూడి, వీరంపల్లి, మరుపూరు, సూరాయపాలెం, ఆల్తుర్తి గ్రామాల్లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను బినామీల పేర్లతో దోచుకున్నారని విమర్శించారు. అలాంటి పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల ఆస్తులకు భద్రత ఉండదని హెచ్చరించారు.

స్థానిక సంస్థలు బలోపేతం కావాలి గ్రామాల అభివృద్ధి వేగవంతం కావాలంటే స్థానిక సంస్థలు బలోపేతం కావాలని సోమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు అందాలంటే టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పొదలకూరు మండలంలో జెడ్పీటీసీతో పాటు 19 మంది ఎంపీటీసీ అభ్యర్థుల విజయానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, తోడేరు ఎంపీటీసీ అభ్యర్థి అట్ల శ్రీకాంత్, టీడీపీ నాయకులు కండే నరసయ్య, కట్ట రవీంద్ర యాదవ్, గంగయ్య, అడపాల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి గాలి సోదరులు.. రాపూరు మండలంలో పార్టీ బలోపేతానికి కృషి....

రాపూరు,(అక్షర దర్శిని) : మండలానికి చెందిన గాలి హరికృష్ణ, గాలి వెంకటరమణ బీజేపీలో చేరారు. వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్-ఎస్ఆర్ నాయుడు ఆధ్వర్యంలో వారు కాషాయ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. దీంతో రాపూరు మండలంలో బీజేపీకి మరింత బలం చేకూరనుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. గాలి హరికృష్ణ గతంలో ఏబీవీపీ మండల అధ్యక్షుడిగా, బీజేవైఎం మండల అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం కొంతకాలం జర్నలిస్టుగా కొనసాగిన ఆయన తిరిగి బీజేపీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా గాలి హరికృష్ణ మాట్లాడుతూ.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు ఆదేశాల మేరకు రాపూరు మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూడల పెంచలయ్య, మండల ప్రధాన కార్యదర్శి తిక్కమనేని వెంకటరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకే ఆత్మకూరు పగ్గాలు..

ఆత్మకూరు, (అక్షర దర్శిని) : అభివృద్ధి, సంక్షేమాన్ని రెట్టింపు ఉత్సాహంతో కొనసాగించాలంటే ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రజలను కోరారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు రూ.5,800 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఈ ప్రగతి ఇలాగే సాగాలంటే మున్సిపల్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా రెడ్డి గారిని, 28 మంది కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆత్మకూరులో శుక్రవారం 'చెప్పాం.. చేస్తున్నాం' ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా రెడ్డితో పాటు 28 మంది కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రజలను నేరుగా కలుసుకొని.. కూటమి ప్రభుత్వం గడిచిన రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాబోయే రోజుల్లో ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి చేపట్టనున్న కార్యాచరణను ప్రజలకు తెలియజేశారు.

బొమ్మిరెడ్డి కుటుంబానిది 50 ఏళ్ల రాజకీయ, సేవా నేపథ్యం ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల్లో చైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా రెడ్డి 50 ఏళ్ల రాజకీయ, సేవా నేపథ్యం కలిగిన కుటుంబమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గైనకాలజిస్టుగా డాక్టర్ షకీలా రెడ్డి ఎంతోమంది మాతృమూర్తులకు వైద్య సేవలందించారన్నారు. షకీలా రెడ్డి మామ, దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బొమ్మిరెడ్డి సుందర రామిరెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. ప్రజలతో అనుబంధం, పేదలకు అండగా నిలిచే సేవా నేపథ్యం కలిగిన ఆ కుటుంబం నుంచి వచ్చిన డాక్టర్ షకీలా రెడ్డికి ప్రజల ఆశీర్వాదం ఉండాలన్నారు. చైర్‌పర్సన్‌గా ఆమెను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రూ.5,800 కోట్లతో ఆత్మకూరు అభివృద్ధి ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు రూ.5,800 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వివరించారు.

పురపోరులో ముగిసిన ప్రచార పర్వం

మొదటి పేజీ తరువాయి

వెళ్లిపోయాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించామని చెప్పారు.

భగత్‌సింగ్ కాలనీ, సర్వేపల్లి కాలువ కట్ట ప్రాంతాల ప్రజల దీర్ఘకాలిక నివాస సమస్యలను పరిష్కరించామని పేర్కొన్నారు. ఇప్పటికే 2,600 శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశామని, మరో 4,500 పట్టాలను సంక్రాంతి నాటికి అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.గతంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన నివాస ధ్రువీకరణ పత్రాలకు, తమ ప్రభుత్వం అందించిన చట్టబద్ధమైన శాశ్వత పట్టాలకు తేడా ఉందని నారాయణ వివరించారు.వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని, చెప్పిన పనులను చేసి చూపిస్తున్నామని పేర్కొన్నారు. నగరంలో అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగాలంటే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో కూటమి అభ్యర్థులను, మేయర్‌గా రూప్‌కుమార్ యాదవ్‌ను ఆశీర్వదించాలని కోరారు.

అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వండి: రూప్‌కుమార్

మంత్రి నారాయణ నాయకత్వంలో నెల్లూరు నగరం ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చెందుతోందని మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. రోడ్లు, సైడ్ కాలువల పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టడంతో పాటు వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నారని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేస్తూ దోమల సమస్యను తగ్గించి నగరాన్ని మెరుగైన వాతావరణంతో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. నారాయణ మద్దతుతో ప్రజల్లోకి వెళుతున్న కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపిస్తే నగర అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని రూప్‌కుమార్ హామీ ఇచ్చారు. నవంబర్ 1న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

నెల్లూరు,(అక్షరదర్శిని): బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సరసమైన ధరలకు బియ్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ విజయవాడలో రైస్ మిల్లర్లు, టోకు, చిల్లర వ్యాపారులతో సమావేశం నిర్వహించి వివిధ రకాల బియ్యానికి గరిష్ట రిటైల్ ధరలను ఖరారు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు, టోకు, చిల్లర వ్యాపారులందరూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట రిటైల్ ధరల ప్రకారం బీపీటీ 329 (సోనా), బీపీటీ 5204 (సాంబ), కేఎన్‌ఎం రకం బియ్యం కిలో రూ.66, హెచ్‌ఎండీ, ఆర్‌ఎన్‌ఆర్ రకం బియ్యం కిలో రూ.76, జై శ్రీరామ్ రకం బియ్యం కిలో రూ.82, సాధారణ రకం బియ్యం కిలో రూ.47కు మించి విక్రయించరాదని తెలిపారు. చిల్లర బియ్యం దుకాణాల వద్ద వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రతిరోజూ నిర్ణయించిన ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. ప్యాకింగ్ చేసిన బియ్యం సంచులపై ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట రిటైల్ ధర (ఎంఆర్‌పీ) మాత్రమే ముద్రించాలని, అంతకంటే ఎక్కువ ధర ముద్రించరాదని స్పష్టం చేశారు.

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం-

కావలి,(అక్షరదర్శిని): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో లక్షలాది కుటుంబాలకు అండగా నిలుస్తోందని కలిగిరి జెడ్పీటీసీ అభ్యర్థి మెట్టుకూరి శిరీష, ఎంపీటీసీ అభ్యర్థి బిజ్జంకుమారి పేర్కొన్నారు.శుక్రవారం అనంతపురం గ్రామంలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.రైతులకు ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్నా క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజనం వంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నాయకత్వంలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థులకు గ్రామస్తులు స్వాగతం పలికి విజయానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం.. పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం

▶▶ విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు.. నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

నెల్లూరు, (అక్షరదర్శిని): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఐపీఎస్ పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. ఎన్నికల బందోబస్తులో పాల్గొనే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు నెల్లూరు, బుచ్చిరెడ్డిపాలెం, ఆత్మకూరు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల విధులకు కేటాయించిన పోలీసు సిబ్బందికి ఆయా ప్రాంతాల ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఎన్నికల భద్రతపై మార్గనిర్దేశం చేశారు.నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో టౌన్ ఏఎస్పీ దీక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రీఫింగ్‌లో ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలు, పోలీసుల బాధ్యతలను వివరించారు.బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పోలీసు సిబ్బందికి నెల్లూరు రూరల్ డీఎస్పీ, ఆత్మకూరు మున్సిపాలిటీ సిబ్బందికి ఆత్మకూరు డీఎస్పీ ప్రత్యేకంగా సూచనలు అందించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు అతీతంగా పోలీసులు వ్యవహరించాలని, విధుల నిర్వహణలో ఎలాంటి పక్షపాతానికి

అవకాశం ఇవ్వకూడదని అధికారులు సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో అనవసరంగా జనసమూహాలు ఏర్పడకుండా చూడాలని, ఓటర్ల స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను తక్షణమే అడ్డుకోవాలని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో ఎదురయ్యే ప్రతి పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని, చిన్నపాటి సంఘటనలను సైతం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. విధులకు కేటాయించిన ప్రాంతాల్లో నిర్ణీత సమయానికి చేరుకుని, అధికారుల మధ్య సమన్వయంతో పనిచేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు.ఈ బ్రీఫింగ్ కార్యక్రమంలో టౌన్ ఏఎస్పీ దీక్ష ఐపీఎస్, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, టౌన్, రూరల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మీ ఆశీస్సులే విజయానికి బాట.. ఓటుతో ఆశీర్వదించండి

▶▶ మన్నేటి లక్ష్మి ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన

ఉదయగిరి, (అక్షరదర్శిని): ఉదయగిరి జడ్పీటీసీ అభ్యర్థి మన్నేటి లక్ష్మి ఇంటింటి ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్లను కలుసుకుని తనను ఇంటి ఆడపడుచుగా ఆదరించి, అమూల్యమైన ఓటుతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నేతృత్వంలో గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో ఉదయగిరి అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు తీసుకురావాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పలు గ్రామాల్లో మన్నేటి లక్ష్మికి మహిళలు హారతులతో స్వాగతం పలకగా, ప్రచారానికి విశేష స్పందన లభించింది.

ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకం

నెల్లూరు, (అక్షరదర్శిని): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమని, ఎన్నికల ప్రక్రియను సూక్ష్మంగా పరిశీలిస్తూ ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ సదా భార్గవి సూచించారు.శుక్రవారం నెల్లూరు నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, కస్తూర్బా కళాక్షేత్రంలో స్థానిక సంస్థలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ విధుల్లో పాల్గొనే మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన జనరల్ అబ్జర్వర్ సదా భార్గవి ఎన్నికల విధుల్లో మైక్రో అబ్జర్వర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధివిధానాలపై పలు సూచనలు చేశారు.ముఖ్యంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని, పోలింగ్ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు.

ఉదయగిరి నియోజకవర్గంలో బీద రవిచంద్ర విస్తృత ప్రచారం

ఉదయగిరి, (అక్షరదర్శిని):స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో విస్తృతంగా పర్యటించి కూటమి అభ్యర్థుల విజయానికి ప్రచారం నిర్వహించారు.సీతారామపురం మండలం దేవరాజుసూరయపల్లెలో మండల పార్టీ అధ్యక్షుడు చింతల శ్రీను, ఇతర నాయకులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నికైన జెడ్పీటీసీ, ఎంపీపీ సభ్యురాలితో పాటు ఎంపీటీసీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జెడ్పీ చైర్మన్ చెంచలబాబు యాదవ్‌తో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీద రవిచంద్ర ప్రజలను కోరారు.

వైసీపీ అభ్యర్థులకు ప్రజాదరణ.. గెలుపు ఖాయమన్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

నెల్లూరు, (అక్షరదర్శిని): నగరంలోని జేమ్స్ గార్డెన్స్, రామ్మూర్తి నగర్ ప్రాంతాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు సిటీ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని 60వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి ఆశ్రిత్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. డివిజన్ ఇన్‌చార్జి నేతాజీ సుబ్బారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నవంబర్ 1న జరిగే ఎన్నికల్లో మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డి, కార్పొరేటర్ అభ్యర్థి ఆశ్రిత్ రెడ్డిని గెలిపించాలని కోరారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో వైసీపీ అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు, అభ్యర్థులపై అక్రమ కేసులు, బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు.

నెల్లూరును నంబర్ 1 స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా

మొదటి పేజీ తరువాయి

నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలపై దృష్టి సారించామని చెప్పారు. మొక్కల పెంపకంతో చండీగఢ్ తరహాలో పచ్చదనంతో నిండిన నగరంగా నెల్లూరును తీర్చిదిద్దుతానని ప్రకటించారు. ఇందుకోసం ప్రభుత్వ నిధులు వినియోగించకుండా తన స్నేహితులు, సన్నిహితుల సహకారం తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

పేదలకు శాశ్వత నివాస హక్కులు తాను తాటాకు గుడిసెలో పుట్టి, కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకున్నానని నారాయణ పేర్కొన్నారు.పేదలకు సొంత ఇళ్లు కల్పించాలనే ఉద్దేశంతో టిడ్కో ఇళ్ల బాధ్యత తీసుకున్నానని చెప్పారు. గతంలో ఏడు లక్షల ఇళ్లకు అనుమతులు ఇచ్చినా, వైసీపీ ప్రభుత్వం వాటి సంఖ్యను తగ్గించిందని విమర్శించారు.భగత్‌సింగ్ కాలనీ వాసులు తమకు చట్టబద్ధమైన ఇంటి పట్టాలు లేవని తన దృష్టికి తీసుకురావడంతో శాశ్వత పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చానని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేబినెట్‌లో నిర్ణయం తీసుకుని పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. పేదలకు సంపూర్ణ హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

విద్య, ఉపాధి, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, వైసీపీ ప్రభుత్వం మూసివేసిన వీఆర్ హైస్కూల్‌ను తిరిగి అభివృద్ధి చేసి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని నారాయణ చెప్పారు.తాము అభివృద్ధి చేస్తున్న పనులపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు.తొమ్మిదో డివిజన్‌లో 22 ఎకరాల స్థలంలో గోడౌన్లు, మార్కెట్ నిర్మిస్తున్నామని, పాలిటెక్నిక్ కళాశాల పరిధిలో స్టేడియం ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.ఒకప్పుడు గుడిసెలో జీవించిన కండక్టర్ కుమారుడిగా ప్రారంభమైన తన ప్రయాణం, నేడు 30 రాష్ట్రాల్లో నారాయణ విద్యాసంస్థల విస్తరణ వరకు సాగిందని పేర్కొన్నారు. నెల్లూరుకు సేవ చేయాలని తన కుమార్తెలు, అల్లుళ్లకు సూచించానని, వారు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. పది వేల మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయడంతో పాటు నేత్రజ్యోతి, దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. బీసీ భవన్, కాపు భవన్, బలిజ భవన్‌లకు విరాళాలు అందించడంతో పాటు పేదలకు తోపుడు బండ్లు, ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లు పంపిణీ చేసినట్లు వివరించారు. గత పాలకులు అన్నా క్యాంటీన్లను మూసివేసి పేదలకు ఇబ్బందులు కలిగించారని విమర్శించారు. నగరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తున్నాం: వేమిరెడ్డి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో ఆదరణ పొందాయని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పట్టణాల అభివృద్ధికి రూ.11 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, పల్లె పండుగ కార్యక్రమం ద్వారా మరో రూ.11 వేల కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ సమన్వయంతో పనిచేసే ట్రిబుల్ ఇంజన్ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.నెల్లూరు నగర అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌తో పాటు కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని నారాయణ, వేమిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.